క్లుప్తంగా

అనుమానిత ఇళ్లలో సోదాలు



ఎగువ తండాలో పర్యటిస్తున్న పోలీసులు

అమడగూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో అనుమానితుల ఇళ్లలో మంగళవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుమ్మల, మలకవారిపల్లి ఎగువతండా, దిగువతండాలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసినట్లు ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపారు. ఇళ్లలో మద్యం నిల్వ ఉన్నా, అనుమానాస్పద వస్తువులు, ప్రాణాపాయం కల్పించే పరికరాలున్నా, బాధ్యులను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఓడీ చెరువు, నల్లమాడ ఎస్ఐలు వంశీకృష్ణ, రమేష్‌బాబు, సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కటారుపల్లి సచివాలయం తనిఖీ

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం 104 సేవలను పరిశీలించారు.

కురుమామిడిలో పోలీసుల కార్డెన్ సెర్చ్



కురుమామిడిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణవేణి

గాండ్లపెంట: మండలంలోని కురుమామిడిలో ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ ఎవరూ ఎలాంటి గొడవలకు పోకుండా ఉండాలని సూచించారు. ఎస్ఐతో పాటు హెచ్‌సీలు రామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

నల్లచెరువు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలు, ఘర్షణలకు దిగరాదని ఎస్ఐ కేఎం లింగన్న హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రాజమొళ్లపల్లి తండాలో ఎస్ఐ లింగన్న తన సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానం ఉన్న ప్రదేశాల్లో సోదాలు చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రతిభ చూపిన బ్రాహ్మణ విద్యార్థులకు సన్మానం చేశారు. వినాయక బ్రాహ్మణ సేవా సంఘం, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ప్రతిభ చూపిన బ్రాహ్మణ విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో సేవా సంఘాల సభ్యులు శ్యామ్‌రావు, లక్ష్మీపతి, విజయ రాఘవేంద్ర, జయసింహ, తీర్థాల వెంకటరమణ, కృష్ణకిషోర్, నారాయణమూర్తి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'వరదహస్తం' పుస్తకావిష్కరణ సభ

అనంతపురం కల్చరల్: గండ్లూరి పంకజమ్మ రచించిన 'వరదహస్తం' పుస్తకావిష్కరణ సభ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహిస్తున్నారు. 'స్పందన' అనంత కవుల వేదిక, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చం.శాస్త్రి ఓ ప్రకటనలో తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో (మెకానికల్ విభాగం) ఫైనలియర్ విద్యార్థులకు 'మస్పాచు సిమిచు' కంపెనీలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ అందించనున్నారు. ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.18,000 స్టైఫండ్, ఉచిత బోధన, రవాణ సౌకర్యం, ఉచిత బీమా, యూనిఫాం అందిస్తారని ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

లక్ష్మీచెన్నకేశవా పాహి..పాహి

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణం.. లక్ష్మీ చెన్నకేశవా పాహి.. పాహి నామస్మరణతో మార్మోగింది. వేలాదిగా భక్తులు తరలిరావడంతో తేరుబజారు కిక్కిరిసిపోయింది. లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మ రథోత్సవం కనుల పండువగా సాగడంతో భక్తులు మురిసిపోయారు. దాతలు పెద్ద ఎత్తున అన్నదానంతో పాటు ప్రసాదం, మజ్జిగ, నీళ్ల పంపిణీ చేశారు.



గజ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామిని తేరు వద్దకు తీసుకొస్తున్న అర్చకులు



వేలాది మంది భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం



రథం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు



మజ్జిగను అందిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

విత్తన రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన



సనపలో విత్తన రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత



విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు



విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీ సనావుల్లా, ఏఓ భారతి

ఆత్మకూరు: సబ్సిడీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలో 485 మంది రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలియజేశారు. ఈ నెల 24 నుంచి విత్తన పంపిణీ ఉంటుందని, 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1710 రైతులు చెల్లించాలని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ కాయలు ఇస్తామన్నారు.

40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ

కనగానపల్లి: మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆమె రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40 సబ్సిడీపై విత్తన కాయలు అందజేస్తోందన్నారు. కనగానపల్లి మండలానికి తొలి విడతగా 1000 కింటాళ్ల విత్తనం కేటాయించారన్నారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వేరుశనగ విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్

ముదిగుబ్బ: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటను సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు తెలిపారు. ముదిగుబ్బ మండలానికి 7,315 క్వింటాళ్ల విత్తన కాయలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అవసరమున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

విత్తన వేరుశనగ నాణ్యత పరిశీలన

నల్లచెరువు: మండలంలోని ఎం.అగ్రహారం పంచాయతీ చెవిటివారిపల్లిలోని రైతు భరోసా కేంద్రంలోని విత్తన వేరుశనగ కాయల నాణ్యతను, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏడీ సనావుల్లా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించి, మొక్కజొన్న, వరిసాగులో నూతన సాగు పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ భారతి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

పుట్టపర్తి: బుక్కపట్నం మండల వ్యాప్తంగా అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఖరీఫ్ 2024కు సంబంధించి విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి సతీష్ మంగళవారం తెలిపారు. రైతులు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో పాటుగా సెల్‌ఫోన్ తీసుకుని ఆర్బీకేలకు వెళ్లాలన్నారు. అలాగే డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎకరం పైనున్న పాస్‌పుస్తకానికి 3 బస్తాలు పంపిణీ చేస్తామన్నారు. 40 శాతం సబ్సిడీ పోగా కే-6 రకం 30 కేజీల బస్తాకు రైతులు రూ 1,710 చెల్లించాలన్నారు.రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే 29 వ తేదీ వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధురాలు మంగళ వారం మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపా రు. సోమవారం రాత్రి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా 70 సంవత్సరాల వయసుగల వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కమనీయం నృసింహుని కల్యాణోత్సవం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పి.యాలేరులో మంగళవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. యన్నం శ్రీలత, యన్నం ఆంథోనిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత లక్ష్మీనరసింహస్వామి, చెంచుభామ, లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మేళతాళాలతో, పసుపు, కుంకుమ కలిపిన అక్షితలతో పండితుల మంత్రాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీతో పాటు అన్నదానం చేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



లక్ష్మీనరసింహస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్‌నగర్‌లో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సాయంత్రం ప్రత్యేక పల్లకీపై స్వామివారిని ఊరేగించారు.

ఆజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కదిరి అర్బన్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ప్రమాణ స్వీకారం చేయాలని, కదిరి ఎమ్మెల్యేగా బీఎస్ మగ్బూల్ అహ్మద్ గెలవాలని ఆజ్మీర్ దర్గాలో కదిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఖలందర్ బాష, ఊబిచెర్ల సర్పంచ్ సమీవుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.



అజ్మీర్ దర్గాలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కూలీలందరికీ ఉపాధి కల్పించండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

చెన్నేకొత్తపల్లి : ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిబ్బంది క్లస్టర్ల పరిధిలోని గ్రామాలకు వెళ్లి పనులు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షించాలన్నారు. పనులు కల్పించని గ్రామాలను గుర్తించి.. అక్కడ త్వరగా పనులు చేయించాలన్నారు. పనుల కల్పనలో నిర్లక్ష్యం వహించినా, కూలీల నుంచి ఏమైనా ఫిర్యాదు అందినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీఓతో పాటు టెక్నికల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం-1లో మాసిక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు పండ్లు, కూరగాయాలతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. నెలసరి సమయంలో మహిళలు, యుక్త వయసు అమ్మాయిలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



తులసీ అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి



లక్ష తులసీ అర్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం పరిధిలో వెలిసిన విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య స్వామి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, బలిహరణ నైవేద్యం పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష తులసీ అర్చన, శాంతహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష తులసీ వేడుకలకు భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు రామ్మూర్తి తెలిపారు.

దుర్గమ్మకు బోనాలు



బత్తలపల్లి: మండలంలోని రాఘవంపల్లిలో వెలసిన దుర్గమ్మకు గ్రామస్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి 41 రోజులు పూర్తవడంతో గ్రామ పెద్దలు నిర్ణయం మేరకు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ నడిబొడ్డున ఉన్న దుర్గమ్మ తల్లిని గ్రామస్తులు పూలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కొత్త కుండలో చేసిన తీపి అన్నాన్ని, నారికేళాలను, పూలను తీసుకుని ఊరేగింపుగా గ్రామంలోని పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరూ దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు అనంతరం గ్రామస్తులు మూగజీవాలను దుర్గమ్మ తల్లికి బలి ఇచ్చారు.

వర్షాలతో ఊరట

చెన్నేకొత్తపల్లి : ఎండలతో అల్లాడిపోయిన జనం ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. సోమవారం రాత్రి 10.04 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పశువులకు గ్రాసం కొంత వరకు తీరుతుందిని గొర్రెలు, మేకలు, ఇతర పాడిపశువుల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి చింతమాను గంగమ్మ ఉత్సవాలు



కోటూరు చింతమాను గంగమ్మ

గాండ్లపెంట: మండలంలోని మలమీదపల్లి పంచాయతీ కోటూరులో చింతమాను గంగమ్మ ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం జ్యోతులు, గురువారం బండ్లమెరవణి ఉంటుందన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు



నార్శింపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్‌తో గ్రామస్తులకు మెరుగైన వైద్యం సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి గోవర్ధన్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని నార్శింపల్లిలో మంగళవారం ఆయన సిబ్బందితో కలసి గ్రామస్తులకు ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్, రక్త, మూత్ర తదితర పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హేమలత, ఎంఎస్‌హెచ్‌పీ అలేఖ్య, ఏఎన్‌ఎం కృష్ణయ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

బత్తలపల్లి: ప్రభుత్వం అందించే వేరుశనగ సబ్సిడీ విత్తనాల కోసం రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ ఓబిరెడ్డి రైతులకు సూచించారు. ప్రభుత్వం 40 శాతం రాయితీతో 30 కేజీల వేరుశనగ బస్తా ధర రూ.1,710గా నిర్ణయించిందన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు తమ భూమి పాసు పుస్తకం, 1బీ, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్ కచ్చితంగా తీసుకురావాలన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రోగులకు బ్రెడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు రావులచెరువు సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు బండారు చైతన్య, నాయకులు నరేష్, రామంజనేయులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మరకత నందికి పూజలు



మరకత నందికి పూజలు చేస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన మరకత నందికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకటేషులు, కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వెన్నగౌడ క్వారిష్ వంశస్థులు మరకత నందిని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల దర్శనార్థం ఏర్పాటు చేస్తున్నారన్నారు. త్వరలో అనంతపురం జిల్లా గుత్తి కామాక్షి దేవాలయంలో మరకత నందిని ప్రతిష్ఠించనున్నారని తెలిపారు. మరకత నందిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని మరకత నందికి పూజలు చేశారు.